

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**• ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి**

రామన్నపేట, సెప్టెంబర్ 30: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ గ్రామీణప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీ బలరాం అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతకు ముందు తమ గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొన్న చోట్ల ఏవీ స్విచ్‌లు పని చేయడం లేదని, మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి పోవడంతో తాగునీరు వృథా అవుతోందని, రోడ్డు పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలు తున్నాయని, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని, ప్రజలు వారికి సహకరించాలని సూచించారు. తాసీల్దార్ లాల్ బహదూర్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానందున ఇంద్రపాలనగరం, శోభనాద్రిపురం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆగమే..
- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నార్కట్‌పల్లి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నార్కట్‌పల్లిలో ఆర్‌ఎంపీ యూనియన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 30 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని షాపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్, రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అక్కెనపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ కమ్యూనిటీహాల్, నార్కట్‌పల్లి పట్టణంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న పద్మశాలి భవనం, రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.15లక్షలతో ఆర్‌ఎంపీ యూనియన్ భవనం, రూ.10 లక్షలతో నిర్మించనున్న వడ్డెర సంఘం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శనివారం శకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రాన్ని ఎక్కువ సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అథోగతి పాలు చేసిందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. కేవలం అధికారం కోసమే తెలంగాణలో అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతుందన్నారు. షాపల్లి, అక్కెనపల్లి గ్రామాల్లో ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నార్కట్‌పల్లి పట్టణాన్ని మోడల్ సిటీగా మారుస్తామన్నారు. రోడ్డు విస్తరణ, సెంటర్ లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్ట మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచులు కర్నాటి ఉపేందర్, చంద్రశేఖర్, ఎంపీటీసీలు కనుకు అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

## లయన్స్ సేవలను విస్తరించాలి

**జోన్ చైర్మన్ అశోక్**



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ జోన్ చైర్మన్ అశోక్

నకిరేకల్, సెప్టెంబర్ 30 : సేవా కార్యక్రమాలను విస్తరించి లయన్స్ ఇంటర్నేషనల్ ఖ్యాతిని పెంచాలని జోన్ చైర్మన్ రావిరాల అశోక్ సభ్యులకు సూచించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్స్, అడ్వైజరీ కమిటీ సమావేశం శనివారం మండలంలోని తాటికల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పర్మినెంట్ ప్రాజెక్టులు, కొత్త సభ్యులను పెంచాలని కోరారు. అంతకుముందు ఈ సంవత్సర కాలంలో చేయాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ నకిరేకల్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, కోశాధికారి వరాకాంతం నారాయణరెడ్డి, నవ్య అధ్యక్షురాలు కందాల శోభారెడ్డి, ప్రధానకార్యదర్శి నెమరుగొమ్ముల రమాదేవి, లయన్స్ క్లబ్ శాలిగౌరారం కార్యదర్శి బచ్చు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్లు బొల్లం శోభాకృష్ణమూర్తి, రామ్మోహన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కిశోర్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**• బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

శాలిగౌరారం, సెప్టెంబర్ 30 : రాబోయే ఎన్నికల్లో తుంగతుర్తి ఎమ్మెల్యేగా గాదరి కిశోర్‌కుమార్‌ను మరోసారి గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బూత్ లెవల్ కమిటీ వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. శుక్రవారం తుంగతుర్తిలో జరిగిన ప్రగతి నివేదన ఆశీర్వాద సభకు మండలం నుంచి భారీగా తరలి వచ్చి విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏఎమ్‌సీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు జెర్రిపోతుల చంద్రమౌళి గౌడ్, బట్ట వీరబాబు, శాలిగౌరారం గ్రామశాఖ అధ్యక్షుడు చిర్రబోయిన శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, లెనిన్, పున్నమి నాగులు, వెంకన్న పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరెల పంపిణీకి ఏర్పాటు చేయాలి

**• అదనపు కలెక్టర్ శ్రీనివాస్**

నల్లగొండ, సెప్టెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ చీరెల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏండ్లు నిండి రేషన్ కార్డులో పేరు ఉన్న మహిళలకు బతుకమ్మ చీరెలు అందజేయాలని సూచించారు. జిల్లాకు 5.61 లక్షల చీరెలు అవసరం కాగా.. ఇప్పటి వరకు 4లక్షల చీరెలు వచ్చినట్లు తెలిపారు. శాలిగౌరారం, నాంపల్లి, నిడమనూరు, మిర్యాలగూడ గోదాముల్లో స్టోరేజ్ చేశామని, ఆయా మండలాల తాసీల్దార్లు, ఎంపీడీఓలు అన్ని గ్రామాలకు తరలించి అక్కడ స్టోరేజ్ చేసుకోవాలని సూచించారు. అక్కడ నుంచి గ్రామ కమిటీల నిర్ణయం మేరకు చీరెల పంపిణీ జరుగుతుందని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. డీఆర్డీఓ నోడల్ అధికారిగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ముత్తయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ ముత్తి లింగయ్య, జడ్పీటీసీ బలరాములు, ఎంపీడీఓ సునీత

## మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సన్మానం

కట్టంగూర్, సెప్టెంబర్ 30 : ఎంపీడీఓ కార్యాలయంలో సబార్డినెట్‌గా పని చేస్తున్న బొల్లం ముత్తయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య, జడ్పీటీసీ తరాల బలరాములు, ఎంపీడీఓ పోరెళ్ల సునీత శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమలంలో పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, ఎంఈఓ మేక నాగయ్య, ఎంపీఓ అథర్ పర్వేజ్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## స్వామినాథన్‌కు ఘన నివాళి

చిట్యాల, సెప్టెంబర్ 30 : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభ శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామినాథన్ ఫ్లెక్సీకి పూలమాల వేపి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, జిట్ట నగేశ్, అర్రూరి శ్రీను, నారబోయిన శ్రీనివాసులు, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహ, రాములు, బుచ్చిరెడ్డి, లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

## 4న కట్టంగూర్ మండల సర్వసభ్య సమావేశం

కట్టంగూర్, సెప్టెంబర్ 30 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 4న ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పోరెళ్ల సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

## ఆలయంలో చోరీ

కట్టంగూర్, సెప్టెంబర్ 30 : కట్టంగూర్ గ్రామ శివారులోని శ్రీకృష్ణనగర్‌లో ఉన్న శివాంజనేయ లక్ష్మీ నరిసింహ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి నర్సింగోజు భిక్షమాచారి ఆలయ తాళాలు పగుల గొట్టి ఉండడం చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆలయంలోని రెండు చిన్న గంటలు, శఠగోపురం, హారతి ప్లేట్లు ఎల్లమ్మగుడిలో గంట, రాగి చెంబు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిట్యాల, సెప్టెంబర్ 30 : మండలంలోని వెలిమినేడులో శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన కళ్లెం బొందయ్య(60) పేరేపల్లిలో భిక్షాటన చేసుకొని ద్విచక్రవాహనంపై వెలిమినేడుకు వస్తున్నాడు. గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుతప్పి కిందపడడంతోతీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్ట్ మంజుల

## మహిళలపై హింసను అరికట్టాలి

నకిరేకల్, సెప్టెంబర్ 30 : మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస, అకృత్యాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పట్టణానికి చెందిన వైద్యురాలు రాపోలు మంజులారఘునందన్ సూచించారు. నకిరేకల్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం మహిళలపై జరుగుతున్న హింస, ఎదుర్కొనే విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పౌష్టికాహారం, ఆరోగ్యసమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ సుమలావణ్య, హైస్కూల్ డీన్ పాల్గొన్నారు.

## గణపతి లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు

కట్టంగూర్, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో సీఎల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం స్వామి వారి లడ్డూ వేలం నిర్వహించారు. మిర్యాలగూడకు చెందిన ముస్లిం యువకుడు మహ్మద్ సమీర్ పాషా రూ.40,116కు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాషబోయిన శివప్రసాద్, జిల్లా అనిల్, కొండ్రాసి నాగరాజు, వంగూరి మణికంఠ, గుండు సాయి తేజ, పోగుల నాగరాజు, మాదగోని మహేశ్ పాల్గొన్నారు.

## 4న ఎన్‌ఎస్‌ఎస్ వలంటర్ల ఎంపిక

రామగిరి, సెప్టెంబర్ 30 : వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ కోసం ఈనెల 4న ఉమ్మడి జిల్లాలోని ఎంజీయూ పరిధిలో గల కళాశాలల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వలంటర్లు ఎంపిక ఉంటుందని ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేట్ మదిలేటి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో ధ్రువీకరించిన బోనాఫైడ్ సర్టిఫికెట్లు, కళాశాల గుర్తింపుకార్డు తీసుకొని రావాలని కోరారు.

## నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, సెప్టెంబర్ 30 : నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఇస్లాంపుర, పొట్టిగడ్డ, సిమెంట్ రోడ్డు, లైన్‌వాడ, అక్కచెల్మ ప్రాంతాల్లో ఉదయం 5.30గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.